ఆమె అతనివైపు క్రీగంటజూచింది. కాని, ఆమె పెదవులు అదురుతున్నాయి. పలుకరిస్తే వెలవెల ఏడ్చివేస్తుందేమో అన్నట్టున్నది ఎర్రబారిన ఆమె ముఖము.

ఒక అడుగుముందుకు వచ్చి, ఆమె భుజాన చేయివుంచి, అతి సుకుమారంగా ఆమె చుబుకమును పైకెత్తుతూ సూటిగా ఆమె కన్నులలోకి చూస్తూ వేణుగోపాలు డన్నాడు ఒక్కమాటే: "నాకోసము!" అని.

ఆమాటకు అదిరి పడింది సత్యభామ.

కాని, ఆమాటవిని నిలువునా కంపించి పోయింది, ఇందుబాల.

ఏదో విద్యుచ్ఛక్తిప్రవాహము ఆమెలోని ప్రతి అణువునూ కదలించివేసి నట్లనిపించింది.

హఠాత్తుగా ముందుకు వంగి శ్రీకృష్ణుని పాదములను తాకింది తన రెండుచేతులా, ఆ ముద్దరాలు.

తన పవిత్రవేళ్ళనూ కన్నుల కద్దుకున్నది. ఆమె వెర్రిగా పదిసార్లు. ఇంతలో దుఃఖము ముంచుకొచ్చింది ఆమెకు. సత్య ఒడిలో తలదాచుకొని వెక్కివెక్కి ఏడువసాగింది. సప్త సముద్రాలూ కట్టతెంచుకున్నవేమో అనిపించింది ఆ నిమిషము.

లేని తీవ్రతను నటిస్తూ సత్య అన్నది శ్రీకృష్ణుని ఉద్దేశిస్తూ "మీరు వెళ్ళిపొండి ఇక్కడినుంచి!" అని.

ద్వారకలో, మళ్ళా.

ఆపిన హిందోళ గానమును పూర్తిచేసి, లీలగా రాగమును మాత్రము మరొక్కసారి వీణ తంత్రులపై పలికించి, వీణను అటుంచి శ్రీకృష్ణుని సమీపించి అంది సత్య, అతని ముఖంలోకి అదోవిధంగాచూస్తూ ప్రశ్నించింది ఆమె: "నిజంగా, నాకోసమేనా?" అని. శ్రీకృష్ణునితో తన యిన్నేళ్ల సహవాసంలోనూ అతని పెదవులనుండి ఆమాట విని ఉండలేదు సత్య. శ్రీకృష్ణుడా ఒకరిని అర్థించడము!

శ్రీకృష్ణుడు జవాబుచెప్పలేదు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దము.

ఉన్నట్టుండి, శ్రీకృష్ణుడు సత్యాదేవి మూర్ధమును ముద్దుపెట్టుకున్నాడు. లక్ష సార్లు అనుభవించిఉన్నా, ఆస్పర్శ ఆమెను పరవశురాలిని చేసింది.

ఆమె అతనిని కౌగలించుకుంది, గట్టిగా, మరీగట్టిగా.

అప్పుడన్నాడు శ్రీకృష్ణుడు "నిజంగా మన మోహనుడు ఎంతో అదృష్టవంతుడు. ఎంత అదృష్టవంతుడో!" అని.

కౌగిలివదలి కాస్త రోషంతో అన్నది సత్య: "కాదు మీ ఇందుబాలే అదృష్టవంతురాలు!"

"అల్లాగా!" అని శ్రీకృష్ణుడు గట్టిగా నవ్వాడు.

ఆ నవ్వును ప్రపంచములోని పంచ వర్ణపు చిలుకలన్నీ ప్రతిధ్వనించాయి ఒక్క గొంతుకతో పదిసార్లు.

ఆ ఆనందానికి విశ్వమే ప్రత్యుత్తరించింది... విశ్వమే తుళ్ళింత లాడింది.

పదునాల్గు భువనాలలోని గుడిగంటలు గణగణ మ్రోగాయి. శ్రవణపేయంగా అన్నీ ఒక్కసారిగా గణగణమ్రోగాయి.

"పదండి! మీ పాదపూజకు వేళఐంది. పదండి!" అంటూ మణికింకిణీ మధుర స్వరముతో, తన కుడిచేతిని శ్రీకృష్ణుని నడుముచుట్టూపోనిచ్చి, అతనిని ముందుకు నడిపించుకు వెళ్ళింది సత్య.

వారిని తనవద్దకు ఆహ్వానిస్తూ పరిమళ భరితమైన పూలవాసనను కురిపించింది విరగ బూసిన పారిజాతము. □□□







ఉదయం లేచే సరికి యీ వార్త చెవిని పడింది.

సత్యమూర్తి యిలాంటి పని చేశాడంటే నమ్మ శక్యం కాకుండా వుంది. ఎందుచేత నంటే సత్యమూర్తితో సరిపోల్చగల సన్మార్గుడూ, సద్గుణ సంపన్నుడూ, సాధువర్తనుడూ, సహనశీలీ సాధారణంగా అరుదని నా అభిప్రాయం. అతను అందరకూ ఆదర్శ ప్రాయుడు.

పెద్దలలో పెద్దగా వ్యవహరించే సత్యమూర్తిని నే నెరుగుదును. పిన్నలలో పిన్నగా మెలగుతూ, వాళ్ళతో పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ పరుగులు తీసే పిల్లవాడ్ని కూడా సత్యమూర్తిలో నేను చూశాను. 'ఫెళ్ళు' మని ఒక చెంపమీద కొట్టినా, పెదవుల మీది చిరునవ్వును చెదిరి పోనీయకుండా, ఒక్క పరుష వాక్యం కూడా పలుకకుండా "ఈ రెండో చెంప మీద కూడా ఒక్కటి వెయ్యి" మన్నట్టు రెండో చెంప చూపేటంత సహనశీలినికూడా సత్యమూర్తిలో కన్నాను. దారంట పోతూంటే "ధర్మం బాబూ" అన్న ప్రతివాడికీ పాత్రాపాత్ర విచక్షణ చేయకుండా, యెంతో కొంత దానంచేసే సత్యమూర్తి ధర్మబుద్ధిని అతడ్ని యెరిగి వున్న వాళ్ళందరూ యెరుగుదురు. పరస్త్రీల వైపు కన్నెత్తైనా చూడని ప్రవర్తన్ని కూడా సత్యమూర్తిలో ప్రతీవారూ చూస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే సత్యమూర్తి దేవుడి లాంటి మనిషి!

ఇంతటి సుగుణరాశిగా పరిగణింపబడుతున్న సత్యమూర్తి అటువంటి నీచకార్యం చేశాడంటే యెలా నమ్మడం?

ఒక మనిషిమీద యెంత సదభిప్రాయం వుండనివ్వండి, ఎంత ప్రేమాభిమానాలు వుండనివ్వండి. ఆతను అటువంటి పని చేయడానికి సాహసిస్తాడనైనా యెవరూ వూహించని పని చేశాడని తెలుస్తే.. అందులోనూ సాంఘికనియమాలనూ సామాజికపు కట్టుబాట్లనూ నరకుచెయ్యకుండా మరీ చేశాడని తెలిస్తే,—అతడి మీదుండే సదభిప్రాయమంతా వేడికి వెన్న కరిగినట్టుగా కరిగిపోతుంది. అభిమానం అంతా సూర్యరశ్మికి మంచు కరిగినట్టు కరిగిపోతుంది. హారతి కర్పూరంలా హరించిపోతుంది. సత్యమూర్తి విషయంలోనూ సరిగ్గా అంతే జరిగింది.

ఈ సంగతి వినగానే 'నిజమా కాదా?' అని సందేహించడం మాట అటుంచి, అతనంటే ఎవరో పగవాడిని గూర్చి మాట్లాడినట్టు మాట్లాడడం మొదలు పెట్టారంతా,

"ఎవరికి ఏ బుద్ధి ఎప్పుడు పుడుతుందో ఎవరు చెప్పగలరు? ఏపుట్టలో ఏ పాముందో ఎవరికి తెల్సు?"

"అందుకనే కాబోలు ఆ రమణయ్యకు అంత సహాయం చేశాడు."

"ఎవరికి ఎవరూ కాని ఈరోజుల్లో ఏ ప్రతిఫలాపేక్ష లేకుండా పరోపకారం చెయ్యడానికి యిది పురాణకాలం కాదండీ. స్వార్థపరులతో నిండివున్న నేటిప్రపంచం పాప పంకిలం కదటండీ."

"అంతలా అంతులేకుండా ఆపేక్ష ఒలికిస్తుంటే అప్పుడే అనుకున్నాను. ఎప్పుడో యిలాటిదేదో జరిగి తీరుతుందని."

"కలికాలం! అందుకే యిలా మండిపోతోంది ప్రపంచం."

"వినాశకాలే విపరీతబుద్ధిః అని, వాడికి వినాశకాలం వచ్చింది. అలాటి పనులు ప్రారంభించాడు."

అబ్బ! ఎంత సంకుచిత స్వభావాలు వీళ్ళవి? వీళ్ళంతా సంఘానికి సభ్యులు! సమాజానికి శాసకులు!! నీతి నియమాలకు రక్షకులు!!!

సత్యాసత్య విచారం లేకుండా, కనీసం అన్వేషణాభిలాషయినా లేకుండా, అపవాదులు అల్లడం, అభాండాలు వేయడం అలవాటు వీళ్ళకి!

అర క్షణంలో అభిప్రాయాలు మార్చుకునే ప్రపంచం రంగులు మార్చే ఊసరవెల్లిలా కనిపించింది!


• • •

రమణయ్యా, సత్యమూర్తి, నేనూ పని చేసేది ఒకే ఆఫీసులో. ఉండేది కూడా ఒకే వీధిలో. ఎర్రగా బక్కపలచగా వుండే రమణయ్య కోల మొహంలో అమాయకత్వం కొట్టొచ్చినట్టు కనపడుతుంది.

అతనికి వచ్చే జీతం ఎంతో అందరికీ తెల్సిందే. కాని ఆ అరవైరూపాయలతో, అతనూ, అతని భార్య కనకం, ముసలి తల్లీ రోగిష్ఠితండ్రీ గల రమణయ్య సంసారం ఎలా గడుస్తూందో రమణయ్యకీ, అంగట్లో

## రావి శ్రీకృష్ణమూర్తి






అతని బాకీ ఎంతుందో కోమటి కోటయ్యకూ బట్టలకొట్లో అతని బాకీ బట్టలకొట్టు బ్రహ్మయ్యకూ తప్ప యీ విషయాలు తెలిసిన మనిషి యింకెవరయినా వుంటే అది సత్యమూర్తే.

"ఎన్నాళ్ళకయినా రమణయ్య తండ్రి జబ్బు నయం కాదే"మని డాక్టరు ధర్మారావుని గాని, "మరీ రంగునీళ్ళే పోస్తున్నావే"మని కంపౌండరు కరుణాకరాన్ని గాని అడగండి.

"జబ్బు నయం అవలేదని నామీద నింద మోపడమేగాని బకాయిపడ్డ పైకం పంపే ఏర్పాటు చెయ్యడం సంగతి ఆలోచించవేం?" అని యెదురుప్రశ్న డాక్టరు ధర్మారావు వేస్తాడు.

"ధర్మారావుగారి పేరుచూసి ధర్మాసుపత్రి అనుకొని మందు తీసుకెళ్ళడమేగాని. మరి తిరిగి చూడటం అలవాటులేని రోగుల రోగానికి ధర్మారావుగారు కనిపెట్టిన కొత్త మందిది. రంగునీళ్ళంటా రేమిటి? అయినా ధర్మంగా పోయడానికి రంగునీళ్ళయినా దండగే కదండీ?" అని కంపౌండరు కరుణాకరం జవాబిస్తాడు!

ఏ పరిస్థితులలో రమణయ్య యింటి విషయాలు గ్రహించాడో కాని, సత్యమూర్తితో స్నేహం కలసిన తర్వాతే కోటయ్య కొట్లో అప్పుతీరింది. బ్రహ్మయ్య బాకీ తీరింది. డాక్టరు ధర్మారావు ఎకౌంట్సులో ఆరేడు నెలలుగా రమణయ్య పేరను బేలన్సున్న బాకీ కూడా "బేడ్ డెట్సు" క్రింద పడబోయే సమయానికి తీరిపోయి వూరుకుంది.

అసలు జరిగినది ఏమిటో తెల్సుకుందామని రమణయ్య యింటికి వెళ్ళాను. ఇంటికి వెళ్ళడమయితే వెళ్ళాను గాని, వీధరుగు మీద దగాపడిన తమ్ముడిలా, ఆషాఢభూతి చే దోచబడ్డ బ్రాహ్మడిలా కూర్చున్న రమణయ్యను ఏమని అడగను?

సంకటావస్థలో పడి ఏమీ మాట్లాడలేక పడుతూండగా రమణయ్యే మాట్లాడి నేను అడగవలసిన అవసరం లేకుండా చేశాడు..

"ఆ ఛండాలపు వెధవ ఇంతపని చెయ్యడానికి సాహసిస్తాడనుకోలేదండీ! అటువంటి తుచ్ఛుడిని బొమికలు విరిగేలా తన్నినా పాపం వుండదండీ! సహాయం చేసినట్టే చేసి ఎంత నాటకం ఆడాడు నాదగ్గర? "స్నేహితుడొకాయన భార్యా సమేతంగా అనుకోకుండా వచ్చాడు. నాగదిలో ఖాళీలేదు. సన్ని రాత్రికి మీ సావిట్లో సాగోరనిస్తారా?" అనడిగాడు వంగనాచిలా. సహాయం చేస్తున్నాడంటే సద్బుద్ధితో చేస్తున్నాడనుకుంటున్నానుగాని యింతటి నీచమైన వూహలతో వుయ్యాల లూగుతున్నాడనిగాని. అవుకాలేని మోహంతో, మదోన్మాదంతో తూగుతున్నాడనిగాని ఎవరూహించగలరు చెప్పండి? ఎప్పుడూ నవ్వుతూనే వుంటాడు మళ్ళీ? పయోముఖ విషకుంభం! ఛీఛీ!!" కసిగా శాంత్రించి ఉమ్మాడు.

"అసలేం జరిగింది?" అనడిగాను.

"ఛీ! ఛీ! ఏం చెప్పమంటారు వాడు చేసిన వెధవ పని....ఒక రాత్రికి సావిట్లో పడుకోడమే కదానని సరేనన్నాను........ తెల్లవారు ఝామున మా కనకం పెరట్లోకి వెడుతోంటే చేయి పట్టుకొని లాగేడట.... పిచ్చిది హడలిపోయి పరిగెట్టుకు వచ్చినన్ను లేపింది. నే వచ్చేసరికి కాళ్ళకు బుద్ధి చెప్పాడు. లేకుంటే పులుసులోకి ఎముక మిగలకుండా చితక కొట్టేవాడిని! ఎక్కడికి పోతాడులేండి! వాడి అంతు చూడక పోతానా!"

పళ్ళు పటపట కొరికాడు రమణయ్య!

"అయినింటి ఆడబడుచు వంటిమీద చెయ్యి వేసిన నాడు అగ్గిలో మాడిమసయి పోతాడు నాయనా! అంతటి దుర్మార్గుడని కానుకోలేక పోయినాడు మా రమణ."

"ఏ పుణ్యాత్మురాలు కన్నదో యీతడిని. ఆవిడ నిజంగా ధన్యురాలు. దేముడినే కన్నది" అని లెక్కలేనన్నిసార్లు నాముందు సత్యమూర్తిని పొగిడిన రమణయ్య తల్లి నోటివెంట వచ్చిన మాటలే యివి!

ఇటువంటి పని సత్యమూర్తివల్లకాదు. అతడి ప్రతి అణువులోనూ మూర్తీభవించిన మంచితనమేకాని, మాటల గోడలవెనుక దాగే దురూహాలు వుండడానికి అవకాశం లేదు. ఉన్నాయన్నా నేను నమ్మలేను. ఎందుచేతనంటే సత్యమూర్తిని నేను ఒక పది సంవత్సరాలుగా ఎరుగుదును. అతడి ప్రవర్తన అందరికి అనుసరణీయం. పూజనీయం.

నేనేం మాట్లాడాలో తెలియలేదు. ఇందులో నిజమెంతో అబద్ధంఎంతో! అయినా అబద్ధమాడవలసిన అవసరం ఏమిటి రమణయ్యకు? అందులోనూ తనను అన్నివిధాలా ఆదుకున్న సత్యమూర్తిపైనా? ఊరికే నరదాకు అపవాదు వేస్తాడా? మరి? సత్యమూర్తే....ముందు యిక ఆలోచించ లేకపోయాను.

ఉన్నట్టుండి రమణయ్య ఒక్కసారి అరుగు మీద నుండి దూకి రోడ్డుమీదకు వెళ్ళాడు. ఏమిటాని అటు తిరిగి చూశాను. రోడ్డుమీద సత్యమూర్తి పడివున్నాడు. మీద కూర్చొని గుభీ గుభీ మని చేతి కొచ్చినట్టు కొడుతున్నాడు రమణయ్య. తిరగబడడానికిగాని. అతడు కొట్టిన దెబ్బలు తప్పుకోడానికి గాని సత్యమూర్తి ప్రయత్నించడం లేదు. రమణయ్య పౌరుషం పేట్రేగి పోయింది. అందులోనూ ప్రత్యర్థి తిరగబడకుండా వూరుకున్నాడు.



ఇంతమరీ విజృంభించాడు. పెద్దగా అరుస్తూ, నోటికొచ్చిన తిట్టుతిడుతూ చేతి కొచ్చిన దెబ్బకొట్టసాగాడు.

రెండు నిముషాలు చేష్టలుడిగి అచేతనంగా నిల్చున్నాను అప్పటికే పలుగురైదుగురు చేరారు. కాని యిటువంటి మనిషికి తగిన శిక్ష యిదేనని, తమచేతనయిన సాయంగా, తలోచెయ్యీ సత్యమూర్తిపైన వెయ్యడం మొదలుపెట్టారు.

నేను ఇంక ఊరుకోలేకపోయాను. మానవత్వంలేని మానవులు మానవులుకారు. దానవులకైనా దాక్షిణ్యం దయా వుంటాయేమో! నాలోని నిద్రపోతున్న మానవత్వం మేలుకొంది. గబగబ అక్కడికి వెళ్ళాను. అతి కష్టంమీద వాళ్ళనుండి విడిపించాను అతడిని అతని మొహం రక్కుకుపోయింది. ముక్కునుండీ పెదాల నుండి రక్తం కారుతోంది. కాళ్ళూ చేతులూ రక్కుకుపోయాయి. చూడడానికి భయంకరంగా అగుపిస్తున్నాడు.

మెల్లగా నడిపించి అతని గదికి తీసుకు వెళ్లాను. అతడి గదిముందు ఒక రిక్షా ఆగి వుంది. లోపలకు అడుగు పెడుతూండగా, ఒకతను బయటకు వస్తున్నాడు. వెనకాలే అతడి భార్య కాబోలు. వుంది. రిక్షా వాడు పెట్టే బెడ్డింగూ తీసుకొస్తున్నాడు.

"అదేమిట్రా? ఎక్కడికీ ప్రయాణం? ఇంకా రెండు రోజులుండి వెళ్తానన్నావ్-అప్పుడే బయలు దేరుతున్నావు ఎక్కడికి?"

అప్పుడే జరిగినదంతా మరచిపోయినట్టు అసలు ఏమీ జరగలేదన్నట్టూ, దూళి ధూసరితమైన శరీరాన్ని, రక్త సిక్తమైన మొహాన్ని మరచిపోయి, మాయమైన చిరునవ్వును మళ్ళీ పెదవుల మీదకు మళ్ళించి అడుగుతున్నాడు అతడిని సత్యమూర్తి.

"చాలురా చాలు! ఈమాత్రం నేపువుంటేనే నీగురించి యింతోటి విన్నాం. ఇంకా వుంటే ఇంకా ఏమి వినవలసివుటుందో. ఇంతవరకూ చిన్ననాటి సత్యానివే అనుకుంటున్నా. నీవింత ప్రతిభావంతుడవని తెలుస్తే అసలు నీ పేరే ఎత్తకపోదును."

"మా చిన్ననాటి స్నేహితుడు సత్యమూర్తి దేముడిలాంటి మనిషి అంటూ పరిగెట్టుకువచ్చారు. చూశారుగా ఎంత దేముడిలాంటివాడో? ఇంక నడవండి!"

అంటూ పక్కనుండి దూసుకొని పోయిందతని భార్య-పేరేమిటో తెలియదుగాని 'సూర్యకాంతం' అని పిలవాలనిపించింది!

రిక్షా ఎక్కుతూ "తగిన శాస్తి జరిగింది లెండి వెధవకి. పళ్ళు హూనంచేసినట్టుంది" అంది అతని భార్య.

---

● ఒకానొక రోమియో ఒక కాలేజ్జూలియట్‌ని గాఢంగా ప్రేమించాడు. "నువ్వు నన్ను పెళ్ళి చేసుకోకపోతే నేను చచ్చిపోతానంతే" అని బెదిరించాడు.

"మంచిదేగా" అని జూలియట్ అతన్ని తిరస్కరించింది. అతరువాత యాభైఏళ్ళకి అతను నిజంగానే చచ్చిపోయాడు.

పెద్ద విట్టుపేసినప్పుడు పగలబడి నవ్వే నవ్వులా గాలిలో కలిసిపోతూ వినిపించింది సత్యమూర్తి "చిన్ననాటి స్నేహితు"డి నవ్వు!

బంధుత్వాలనే బంధాలను సహితం తెంచుకొని ఎవరికివారే యమునా తీరేగా నివసించే హైదరాబాద్‌వంటి మహానగరంలో వరులపంచను పడుకొని, తన గదిని రెండు రోజులు వీళ్ళకి యిచ్చినందుకూ, ఆతిధ్యం అందించినందుకూ, ఇంకా వుడమని బల వంతంచేస్తున్నందుకూ సత్యమూర్తి కిది ప్రతిఫలమా? దెబ్బలుతిని వున్నాడన్న కరుణకూడా కనిపించదే, సత్యమూర్తి వీళ్ళం దరకూ సహాయం ఎందుకు చేస్తున్నట్టు? వీళ్ళనుంచి ఏం ప్రతిఫలం ఆశిస్తున్నట్టు?"

"ఇలాంటి వాళ్ళనందర్నీ చేరదీసి అంత ఆప్యాయంగా ఆదరిస్తా వెందుకు?" అనడిగాను.

"అది వాళ్ళ తప్పు కాదు కదా! నిజ మేమిటో తెలిస్తే వాళ్ళు అలా వెళ్ళిపోతా రంటావా?" అన్నాడు సత్యమూర్తి.


అతడి పెదిమల మీద చిరునవ్వు అలాగే వుంది.

"నిజం ఏమిటో చెప్పి వాళ్ళ మనస్సు లోని దురభిప్రాయాన్ని ఎందుకు తొలగించవు?"

"నిజం చేదుగావుంటుంది. చేదుగావుండే నిజాన్ని నిజంగా గ్రహించ గలగడానికి మానడానికీ, ప్రజల మీద పరిస్థితుల ప్రభావం ఎక్కువగా పనిచేస్తుంది"

"అలాగని నిజాన్ని తొక్కి వుంచడం మంచిదా?" దీనికి సత్యమూర్తి మాట్లాడ లేదు.

"మానవుడిలో స్వార్థం ఎక్కువ అంటారు. మరి నీ స్వార్థం కోసమయినా, సంఘంలో ఈ సంఘటనవలన నీకు కలిగిన చెడ్డపేరును చెరుపుకోవేం, నిజంచెప్పు?"






"చెప్పానుగా చేదుగావుండే నిజాన్ని నిజంగా నిరూపించడం కష్టమని."

"అలాగని నువ్వు నలుగురిలో చెడ్డవు తావా? కష్టమయినా, నష్టమయినా నిజాన్ని ప్రజలముందుంచి, నీ పేరు నిలుపుకోవడం మంచిదికాదా? ధనం లేకపోయినా బతక వచ్చుగాని, పేరులేకుంటే పదిమందిలో తిరగగలవానువ్వు?"

"పదిమందినీ బాధపెట్టే నిజాన్ని బయట పెట్టి దాన్ని నిరూపించడానికి నిర్ప్రయోజనంగా బాధపడేవానికంటే ఒక్కడు లోకం దృష్టిలో దోషిగా వుండడ_నయం కాదూ?"

"నీ మాటలు నాకేం అర్థమవటంలేదు. అసలేంజరిగిందో చెప్పు."

"జరగడానికి, చెప్పుకోడానికీ ఏముంది యిందులో. మానవ జీవితం అన్నాక కోరిక లూరడం సహజం. కోరుకున్నవన్నీ చేరువైతే యింక మరి జీవితం ఏముంది? కెరటాలు కడలిలోనే కదలాడాలిగాని చెలియలి కట్టదాటితే ప్రమాదమేగా, మనసులో మెదిలే కోర్కెలు కెరటాల వంటివి. ఆ కోర్కెలు, ముఖ్యంగా అవి తీరేవి కానప్పుడు, అవినీతి కరమైనప్పుడూ మనసులోనే మరుగుపడాలి. కాని, సమాజపు కట్టుబాట్ల చెలియలి కట్ట దాటి, వెల్లువికి పైకి ప్రవహిస్తే ప్రతిఫలం ఎవరికో వకరికి ప్రమాదమే కదా!"

సంగతేమిటో అర్థమవడానికి అట్టేసేపు పట్టలేదు నాకు.

మాట్లాడకుండా చిరునవ్వుచిందే సత్య మూర్తి మొహాన్ని చూస్తూ అతడి మనో వైశాల్యాన్ని అంచనా కట్టడానికి ప్రయత్ని స్తున్నాను.

సంఘం దృష్టిలో సత్యమూర్తి చీడపురుగు లాంటి వాడిప్పుడు "పయోముఖ విషకుంభం" అన్నాడు రమణయ్య. "ప్రతి భావంతుడ"ని వెక్కిరించాడు సత్యమూర్తి "చిన్ననాటి స్నేహితుడు". మదాంధుడు, మిత్రద్రోహి యింకా యింకా ఎన్నో అంటారు సమాజానికి సభ్యులూ, సమాజానికి నీతి నియమాలకూ రక్షకులు అయినా సత్యమూర్తిలో దైవాంశ నాకు కనిపిస్తూంది. అతడు దేముడిలాంటి మనిషి!

లోకం గుర్తించలేని అసంఖ్యాకమైన సత్యాలలో యిదీ ఒకటి! □□□

---

● భార్య: "చూడండి. పక్కింటి మొగుడూ పెళ్ళాలు ఎంత ముచ్చటగా వుంటారో. ఆ అబ్బాయి రోజూ ఆఫీసుకెడుతూ పెళ్ళానికి టాటా చెప్పిమరీ వెడతాడు. మీ కల్లాంటి సరదాలే లేవాయె."

భర్త: "నేనూ టాటా చెబుదునుగాని, ఆ అమ్మాయి వూరుకుంటుందా అని."